
చూసి కూడా గ్రహాంతర వ్యోమనౌకగా భ్రమపడ్డారనీ... తమ ఊహలనే నిజంగా నమ్ముతూ ఇలాంటి కథను అల్లారనీ వీరి విశ్లేషణ. అయితే ఇది కేవలం ఓ ఒంటరి సందర్భం మాత్రమే కాదు. గ్రహాంతరవాసులు కిడ్నాప్ చేసి వదిలిపెట్టారంటూ వందల కేసులు నమోదయ్యాయి. వీరందరి ఆరోపణల్లోనూ కొన్ని పోలికలు కనిపిస్తాయి. ఏలియన్స్ వీరిని పట్టుకోవడం, ఆ తర్వాత స్పృహ కోల్పోవడం, మెలకువ వచ్చాక తమ శరీరాన్ని పరీక్షించిన ఆనవాళ్లు, ఏంతసేపు గడిచిందో తెలియకపోవడం, కొన్నాళ్లపాటు ఏదో డ్రగ్స్ తీసుకున్నట్టుగా ఉత్తేజంగా తోచడం... ఇంచుమించుగా ఇవే లక్షణాలు కనిపించేవి.

### అన్నిటితోనూ ముడి!

ఏదన్నా జరిగినప్పుడు... దాని వెనుక ఓ అనూహ్యమైన కారణాన్ని వెతకడం సహజం. అలాంటి వింత కారణాలు ఉద్వేగం రగిలిస్తాయి. ఇలాంటి సందర్భంలో గ్రహాంతరవాసులదే అగ్రతాంబూలం. లోకంలో ఏం జరిగినా సరే, దాన్ని ఏలియన్స్‌కి ముడిపెట్టేస్తూ ఉంటారు. చైనా వాల్‌ను గ్రహాంతరవాసులే నిర్మించారనీ, గిజా పిరమిడ్‌కి వారి సాయమే కీలకమనీ కొందరి వాదన. అమెరికా చరిత్రలోనే అత్యంత ప్రజాదరణ కలిగిన అధ్యక్షుడు జాన్ కెనడీ చనిపోయినప్పుడు, అది ఏలియన్స్ పనే అని నమ్మినవారున్నారు. ఎక్కడన్నా పశువులు హఠాత్తుగా చనిపోతే, అది ఏలియన్ల పనే అని శాపనార్థాలు పెడుతుంటారు. 2005లో 'ప్రాజెక్ట్ సెర్పో' అనే పుకారు బయల్దేరింది. కొంతమంది ఏలియన్లు ఇక్కడికి వచ్చి, తమ బదులుగా కొందరు మనుషుల్ని తమ గ్రహాల మీదకు పంపే మార్పిడి కార్యక్రమం ఒకటి ఉందనే వార్తే ఈ ప్రాజెక్ట్ సెర్పో. మెన్ ఇన్ బ్లాక్, ఇండిపెండెన్స్ డే లాంటి సినిమాలు వచ్చాక ఇలాంటి ప్రచారాలకు తిరుగులేకుండా పోయింది. ఈ సందర్భంలో... నకిలీ ఫొటోలు, వీడియోలు కూడా చేరితే ఇక చెప్పేదేముంది. ఉదాహరణకు 1995లో గ్రహాంతరవాసులను పోస్ట్‌మార్టం చేస్తున్నట్టు ఏకంగా ఓ వీడియోనే బయటకు వచ్చింది. అది నకిలీదే!




### మనమధ్యే ఉన్నారా!

గ్రహాంతర వాసులు ఉన్నారా లేదా అన్న ప్రశ్నను దాటేసి కొంతమంది ఇంకా దూరం వెళ్లిపోయారు. అసలు ఏలియన్స్ మన మధ్యనే తిరుగుతున్నారనీ, మనుషుల రూపంలోనే ఉన్నారనీ వీరి నమ్మకం. టామ్ క్రూజ్, మార్క్ జుకర్‌బర్గ్, ఎలన్ మస్క్... లాంటి వాళ్లంతా కూడా మానవ రూపంలో ఉన్న గ్రహాంతరవాసులని వీరు కుండబద్దలు కొట్టేస్తారు. ఈమధ్యే ఇలాంటి నమ్మకాల మీద హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో ఓ పరిశోధన పత్రం కూడా వెలువడింది. దీని ప్రకారం మన మధ్యే ఉండే ఏలియన్స్‌కి సంబంధించి నాలుగు రకాల సిద్ధాంతాలు ప్రచారంలో ఉన్నాయి. సాంకేతికంగా అభివృద్ధి చెందిన ప్రాచీన నాగరికతకు చెందిన మనుషులు... తిరిగి భూమ్మీదకు వస్తూపోతూ ఉన్నారన్నది తొలి సిద్ధాంతం. డైనోసార్లు లేదా కోతుల నుంచి మనుషులకంటే గొప్ప మేధస్సు ఉన్న జాతులు మన మధ్యే సంచరిస్తున్నాయన్నది రెండో సిద్ధాంతం. చంద్రుడిలాంటి చోట్ల దాక్కుని వస్తూపోతూ ఉండే గ్రహాంతరవాసులు మనలాగే కనిపిస్తారన్నది మూడో సిద్ధాంతం. మాయా మంత్రాల సాయంతో కొందరు మనుషుల్లాగే ఉంటున్నారన్నది నాలుగో సిద్ధాంతం. వీటికి ఎలాంటి శాస్త్రీయమైన ఆధారం లేనప్పటికీ నమ్మకాలు మాత్రం చాలా బలంగానే ఉన్నాయి. అసలు మన భూమి మధ్యభాగంలోనో, లేదా శంబాలా లాంటి రహస్యమైన ప్రదేశాల్లోనో ఏలియన్స్ ఉనికి ఉందన్నది సుదీర్ఘకాలంగా వినిపిస్తున్న మాట. జర్నీ టు ద సెంటర్ ఆఫ్ ది ఎర్త్, ద టైం మెషిన్ లాంటి సైన్స్ ఫిక్షన్ నవలలు కూడా ఇలాంటి ఊహలకు ఆజ్యం పోశాయి.

### ఆస్ట్రోబయాలజీ

1950ల తర్వాత అంతరిక్షంలోకి ప్రయాణాలు మొదలయ్యాయి. దాంతో ఆస్ట్రోబయాలజీ అనే పదం కొత్తగా వచ్చిచేరింది. లోకంలో ఎక్కడెక్కడ 'బయో సిగ్నేచర్స్'... అంటే జీవానికి అనుగుణమైన వాతావరణం ఉందో గమనించడమే ఈ శాస్త్రం. అంతేకాదు! ఎడారులు, సముద్రగర్భాలతో పాటుగా అతి కఠినమైన పరిస్థితుల్లో జీవం ఎలా మనగలుగుతుంది అని కూడా పరిశోధిస్తుంటారు. దీనివల్ల జీవం ఉండటానికి అంతా సౌకర్యవంతమైన వాతావరణమే ఉండాల్సిన పనిలేదు అని నిరూపించే ప్రయత్నం జరుగుతుంది. ఇలా చేయడం వల్ల భవిష్యత్తులో గ్లోబల్ వార్మింగ్ లాంటి ప్రతికూలతల మధ్య ఎలా జీవించాలో తెలుస్తుంది.





## ఆ శబ్దం ఏంటి?

అంతరిక్షంలోనూ కొన్ని సంకేతాలు ఉంటాయి. తారలు వెలువరించే రేడియో సిగ్నల్స్, గ్రహగతుల నుంచి వచ్చే శబ్దాలు, గెలాక్సీల నుంచి వెలువడే కాంతి... ఇవన్నీ కూడ ఎంతో సమాచారాన్ని ఇస్తాయి. ఈ తరంగాలను విశ్లేషిస్తే గ్రహాంతరవాసులు ఉనికి తెలుస్తుంది కదా అని శాస్త్రవేత్తల ఆశ. దీన్నే SETI (Search for Extraterrestrial Intelligence) అంటారు. 1960ల నుంచే ఈ ప్రయత్నాలు మొదలయ్యాయి. 1977లో ఓహియోలోని బిగ్ ఇయర్ అనే టెలిస్కోప్ ఇలాంటి పనిలోనే ఉండగా... దానికి కొన్ని వింత శబ్దాలు వినిపించాయి. దాదాపు 72 సెకన్ల పాటు ఉన్న ఆ శబ్దాలు చాలా భిన్నంగా ఉన్నాయని గ్రహించారు ఖగోళ శాస్త్రవేత్తలు. ధనుస్సురాశి వైపు నుంచి వచ్చిన ఈ శబ్దం... గ్రహాంతరవాసులు మనకు పంపిన సందేశం అని చాలామంది నమ్మారు. అందుకే దీనికి 'WOW Signal' అని పేరు పెట్టారు. కానీ ఆ తర్వాత రోజుల్లో ఆ శబ్దం వెనకాల ఉన్న అర్థాన్ని కానీ, మరిన్ని శబ్దాలను కానీ తెలుసుకోలేకపోయారు. దాంతో 2015లో Breakthrough Listen పేరుతో 800 కోట్ల రూపాయల ఖర్చుతో ఇలాంటి శబ్దాలను వినేందుకు ఓ భారీ ప్రాజెక్ట్ మొదలుపెట్టారు. ఇప్పటివరకైతే ఈ ప్రాజెక్టు నుంచి ఆశాజనకమైన ఫలితాలు ఏవీ రాలేదు.